నేడు మున్సిపల్ ఆఫీస్ ముట్టడి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం నాడు అనంతపురం మున్సిపల్ ఆఫీస్‌ను ముట్టడిస్తున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం తెలిపారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. మున్సిపల్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియె ఓల్డ్ టౌన్ నగర ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, ఇంజినీరింగ్ యూనియన్ నాయకులు రాయుడు, మల్లికార్జున, పొతుల య్య, లోకేష్, ఇతర కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

జడి వాన

- తేలికపాటి వర్షాలే...
- ఎడతెరిపిలేని జల్లులతో జన జీవనానికి ఆటంకం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అల్పపీడిన ప్రభావం ఉమ్మడి అనంతపురం జిల్లాపైనా పడింది. జడివాన రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. అయితే ఉమ్మడి జిల్లాలో ఎక్కడా కూడా భారీ వర్షాలేవీ నమోదవ లేదు. తేలికపాటి జల్లులు ఉదయం నుంచి రాత్రి వరకు పడుతూనే ఉన్నాయి. దీంతో సాధారణ జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. జనం బయటకు పూర్తి స్థాయిలో వచ్చి పనులు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లాలో తాడిపత్రి ప్రాంతంలో కొద్దిగా ఎక్కువగా వర్షపాతం నమోదవగా సత్యసాయి జిల్లాలో హిందూపురం ప్రాంతంలోని మండలాల్లో కొద్దిగా ఎక్కువగా వర్షపాతం నమోదయింది.

అనంతపురం జిల్లాలో బుధవారం ఉదయం వరకు నమోదయిన సగటు వర్షపాతం 4.6 మిల్లీమీటర్లు ఉంది. ఇందులో అత్యధికంగా యాడికి మండలంలో 15.4 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. గుమ్మగట్టలో కనిష్టంగా 1.2మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయింది. మొత్తంగా చూసినప్పుడు జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 50.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు చస్తే సాధారణ వర్షపాతం 116.4 మిల్లీమీటర్లు అయితే పడింది 96.3 మిల్లీమీటర్లు 17.2 శాతం తక్కువగా వర్షపాతం నమోదయ్యింది. సాధారణానికి దగ్గరగా వర్షపాతం నమోదయినట్టు కనిపించినా ఇంకా 18 మండలాల్లో వర్షపాతం లోటు నెలకొంది. ఇక సత్యసాయి జిల్లాలోనూ అన్ని మండలాల్లో వర్షపాతం నమోదవగా గోరంట్లలో అత్యధికంగా 21.4 మిల్లీమీటర్లు మంగళవారానికి నమోదయ్యింది. ఇక్కడా సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు కురవాల్సింది 128.5 మిల్లీమీటర్లకుగానూ 95.2 మిల్లీమీటర్లు నమోదయ్యింది. ఇక్కడ ఇంకా 17 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.

వర్షాలు నేడూ కొనసాగే అకాశం

వర్షాలు ఉమ్మడి అనంతపురం జిల్లాపై బుధ, గురువారాలున్నట్టు వాతావరణ శాఖ ప్రకటనలో పేర్కొంది. ఒక మోస్తరు వర్షాలు అనంతపురం జిల్లాలో పడుతాయని హెచ్చరించింది. సత్యసాయి జిల్లాలో పిడుగులు పడే అవకాశం ఉన్నట్టు ప్రకటనలో పేర్కొంది. వరుసగా పడుతున్న వర్షాల ప్రభావం కొన్ని పంటలపై ఉండే అవకాశముందని కూడా ఆ ప్రకటనలో పేర్కొంది. బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షపాతం మరింత పెరిగింది.

స్తంభించిన జనజీవనం

వర్షం తెరిపిలేకుండా వస్తుండటంతో సాధారణ జనజీవనం స్తంభించింది. రోడ్డుపై జరిగే చిరు వ్యాపారాలు మూతపడ్డాయి. జన సంచారం కూడా చాలా వరకు తక్కువగా ఉంది. ఖరీఫ్‌లో ఇంకా పంటలు పూర్తి స్థాయిలో సాగవకపోవడంతో వర్షాధార పంటలకు పెద్దగా నష్టం వాటిల్లే అవకాశం లేనప్పటికీ ఉద్యానవన పంటలపై ప్రభావం చూపే అవకాశముంది. టమోటా పంట కొన్ని చోట్ల కోత దశకు వచ్చి ఉంది. అధిక వర్షాల వల్ల టమోటా దెబ్బతినే అవకాశమున్నట్టు రైతులు వాపోతున్నారు. మంచి ధర ఉన్న సమయంలో పడుతున్న ఈ వర్షం వల్ల రైతులకు నష్టం చేకూరుతుందన్న ఆందోళన నెలకొంది.

అనంతపురం రూరల్ పరిధిలోని ఓ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

గూగూడు ఉత్సవాలపై వర్షం దెబ్బ

- వ్యాపారాలన్నీ వర్షార్పణం
- వృథా అయిన ముందస్తు ఏర్పాట్లు
- భక్తులు లేక చినబోయిన చిన్న సరిగెత్తు
- బాడుగలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉందంటున్న వ్యాపారులు

వర్షంతో గూగూడులో ఖాళీగా ఉన్న వ్యాపార సముదాయాలు

గూగూడులో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

ప్రజాశక్తి-నార్పల

జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత వైభవంగా నిర్వహించే గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలకు ఈ సారి జడివాన అడ్డంకిగా మారింది. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జడివానతో బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా దాదాపు 10 రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు ఇక్కడ దుకాణాలు నిర్వహిస్తారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గూగూడుకు వచ్చే భక్తుల సంఖ్య నామమాత్రంగానే ఉంది. దీంతో వ్యాపారాలు సన్నగిల్లాయి. కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చిన్నసరిగెత్తు భక్తులు లేక వెలవెల బోయింది. ప్రతి ఏడాదీ చిన్నసరిగెత్తు ఉత్సవానికి ఉదయం నుంచే భక్తులు పోటెత్తేవారు. ఈ ఏడాది జడివానకు ఆస్థాయిలో భక్తులు ఎవరూ రాలేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వివిధ దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులకు వ్యాపారాలు లేక ఇబ్బంది పడ్డారు. తాము తీసుకున్న స్థలాలకు బాడుగలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏర్పాట్లపైనా వర్షం దెబ్బ

రెండు రోజులుగా కురుస్తున్న జడివానకు అటు బ్రహ్మోత్సవాల నిర్వహణకూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా వివిధ పంచాయతీల నుంచి పంచాయతీ కార్మికులను పిలిపించి గూగుడు గ్రామం మొత్తం పారిశుధ్య పనులు చేయించారు. రోడ్డుపై మొత్తం మట్టి గ్రావెల్‌ను తోలించి అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామ సర్పంచ్ రమణకుమారి శివయ్య, ఎంపీడీవో దివాకర్, ఈవోఆర్డీ లక్ష్మీనరసింహ, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో గత పది రోజుల నుంచి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ ఏర్పాట్లు అన్నీ కూడా వృథా అయినట్లు కన్పిస్తోంది. వర్షాల దెబ్బకు గుగూడులోని డ్రెయినేజీ నీరు మొత్తం రోడ్లపై పారుతోంది. ఆలయానికి వచ్చే రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. వీటిపై భక్తులు నడిచేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఈ వర్షాలు ఇలాగే కొనసాగితే కుళ్లాయి స్వామి పెద్ద సరిగెత్తు, అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమాల్లో భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

భక్తులపై టోల్‌బాదుడు..

కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి గూగూడుకు వచ్చే భక్తులపై టోల్‌బాదుడు పడుతోంది. గూగూడు గ్రామ సరిహద్దులోనే పంచాయతీ గేటును ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా టోల్‌ను వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనానికి సైతం రూ.20 వసూలు చేస్తున్నారు. కార్లు, ఇతర వాహనాలకు వంద రూపాయల టోకెన్లు ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తాము పంచాయతీలో వేలాలు పాడామని, అందుకే టోల్ వసూలు చేస్తామని చెబుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులును ప్రజాశక్తి వివరణ కోరగా టోల్‌గేటు వసూలుకు పంచాయతీ వేలాలు వేసిన మాట వాస్తవమే అన్నారు. ఇందులో ద్విచక్ర వాహనాలకు ఎటువంటి రుసుం లేదన్నారు. ఆటోకు రూ.30, కారుకు రూ.50, ఇతర భారీ వాహనాలకు రూ.70 వసూలు చేయాలని పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టోల్ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాడుగ కూడా వచ్చే పరిస్థితి లేదు

మదనపల్లి నుంచి వ్యాపారం నిమిత్తం గూగూడుకు వచ్చాను. కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో బొమ్మల దుకాణం ఏర్పాటు చేయడానికి రూ.20 వేలకు స్థలాన్ని బాడుగకు తీసుకున్నాను. ఈ ఏడాది వర్షాల వల్ల వ్యాపారాలు జరగడం లేదు. కనీసం స్థలం బాడుగ కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది.

చిన్నా, బొమ్మల దుకాణం నిర్వాహకుడు.

కొనేవారే కరువయ్యారు

గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తాను ప్రతి ఏడాదీ గుంతకల్లు నుంచి గూగూడుకు వచ్చి కాజా, మిఠాయి అమ్మకాలు చేస్తున్నాను. ప్రతి ఏడాదీ అమ్మకాలు ఆశాజనకంగా ఉండేవి. ఈ ఏడాది వర్షాల వల్ల మిఠాయిలు కొనేవారే కరువయ్యారు.చాలా నష్టపోవాల్సి వస్తోంది.

ప్రసాద్, మిఠాయి వ్యాపారి.

తక్కువగా వస్తున్నారు...

గాజుల వ్యాపారం నిమిత్తం రాప్తాడు నుంచి ప్రతి ఏడాది గూగూడుకు వస్తాను. చిన్న సరిగెత్తు సమయానికి సుమారు తాను తెచ్చిన సరుకులో సగభాగం అమ్ముడుపోయేవి. ప్రస్తుతం వర్షం కారణంగా గూగూడుకు వచ్చే మహిళల సంఖ్య తగ్గింది. ఇప్పటి వరకు తెచ్చిన సరుకులో 10 శాతం కూడా అమ్ముడుపోలేదు.

హనుమంతప్ప, గాజుల వ్యాపారి.

కడప ఉక్కు పరిశ్రమకు కేంద్రం మోసం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపించలేమని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించడం రాయలసీమ ప్రజలను మోసం చేయడమేనని సిపిఎం జిల్లా కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో భాగంగా రాయలసీమ అభివద్ధికి ప్రత్యేక నిధులు, కడపలో ఉక్కు పరిశ్రమ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, కేంద్ర ప్రభుత్వ సంస్థలు స్థాపించాల్సి ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా వీటిని అమలు చేయకుండా తీరని ద్రోహం చేసిందన్నారు. గతంలో రాష్ట్ర బిజెపి ప్రకటించుకున్న రాయలసీమ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నామని ఆ పార్టీ నూతన రాష్ట్ర అధ్యక్షురాలు ప్రకటించిన మూడు రోజులకే కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ స్థాపించలేమని చెప్పడం ఆ పార్టీ నయవంచన విధానాలకు అద్దం పడుతోందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పార్లమెంట్‌లో ఈ ప్రకటన చేస్తుండగా రాష్ట్రా ఎంపీలు మౌనంగా ఉండడం తెలుగుజాతికే అవమానమని విమర్శించారు. అనంతపురంలో నిర్మించాల్సిన కేంద్రీయ విశ్వవిద్యాలయం నిధులు గురించి కేంద్ర మంత్రి కనీస ప్రస్థావన చేయకపోవడం విచాకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై రాజకీయాలకతీతంగా రాయలసీమ ప్రజలు, మేధావులు యువకులు నిరసించాలని పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి ఘన స్వాగతం

ప్రభాకర్‌చౌదరికి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

లండన్ పర్యటన ముగించుకుని అనంతపురం చేరుకున్న మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరికి టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. బుధవారం బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి పుచ్చగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. పూల మాలలు, శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. లండన్‌లో వారం రోజుల పాటు తెలుగు సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని వచ్చిన సందర్భంగా టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి అభిమానాన్ని చాటుకున్నారు. మరూర్ టోల్ ప్లాజా వద్ద తెలుగుయువత నాయకులు బంగినాగ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో మాజీ ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్నారు. ఇంటి వద్ద అభిమానుల తాకిడితో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సరిపూటి రమణ, మార్కెట్ మహేష్, గోపాల్‌గౌడ్, సుధాకర్‌యాదవ్, చంటి, కూచి హరి, బోయపాటి బాలప్ప, నాగరాజు, వన్నూర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఇంటింటి ఓటరు సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్పెషల్ సమ్మర్ రివిజన్ – 2024కు సంబంధించి చేపడుతున్న ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో స్పెషల్ సమ్మర్ రివిజన్ – 2024 ఇంటింటి సర్వేపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19,39,163 మంది ఎలక్టోరోల్స్ ఉండగా, 5,98,798 హౌస్ హోల్డ్స్ ఉన్నాయన్నారు. ఎస్ఎస్ఆర్ 2024కు సంబంధించి ఈనెల 21వ తేదీ నుంచి ఇంటింటి సర్వే జరుగుతోందని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం బిఎల్ఓ(బూతు లెవెల్ ఆఫీసర్)లు ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. బిఎల్ఓలతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లు సర్వేలో పాల్గొనాలన్నారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి టోల్ ఫ్రీ నెంబర్ పనిచేస్తుందన్నారు. ఓటు హక్కు నమోదుపై విస్తతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు అందించిన సూచనలపై పరిశీలన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీ నాయకులు మాట్లాడుతూ జీరో పేరు మీద ఉన్న ఓటర్ లిస్ట్‌ను పరిశీలన చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, వైసిపి నాయకులు శ్రీనివాసులు, సిపిఎం నాయకులు నల్లప్ప, బాల రంగయ్య, బిజెపి నాయకులు ఈశ్వర ప్రసాద్, శ్యాంసుందర్, బీఎస్పీ నాయకులు హరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ శాన్వి, ఐటీ టెక్నీషియన్ శివ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

నైపర్ జేఈఈ-23 ఫలితాల్లో ఓటీపీఆర్ఐ విద్యార్థుల ప్రతిభ

నైపర్ జేఈఈ-23 ఫలితాల్లో ప్రతిభచాటిన ఓటీపీఆర్ఐ విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు అనుబంధం కళాశాల ఓటీపీఆర్ఐ విద్యార్థులు నైపర్ జేఈఈ–2023 ఫలితాల్లో ప్రతిభ చాటారు. జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఈసందర్భంగా ఓటీపీఆర్ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఓటీపీఆర్ఐ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా జేఎన్టీయూ అనుబంధ తైలసాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించి నైపర్ జేఈఈ–2023లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు. కె.ప్రత్యూష–249, శివరంజని–795, కె.జోషిత–890, జి.లింగేశ్వర–1600, జి.సుకన్య – 2300, ఎస్.బ్లేస్సీ 2977, ఎం.శిరీష్–3283, కె.శ్వేతాబాయి–3647 ర్యాంకులు సాధించారని చెప్పారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు దేశవ్యాప్తంగా మొహాలీ(చండీఘర్)హైదరాబాద్, గౌహతి, కలకత్తా, రాయబరేలీ, హాలీపూర్‌లతో ఉన్న నేషనల్ ఇన్స్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ అండ్ రీసెర్చ్ విద్యాసంస్థల్లో ఎమ్.ఫార్మసీ విద్యను అభ్యశించే అవకాశం ఉంటుందని అన్నారు. పీజీ విద్యను వివిధ విభాగాలతో చేయవచ్చన తెలిపారు. వీరు తమ పీజీ విద్యను ఫార్మాస్యూటిక్స్, కెమిస్ట్రీ, ఫార్మికాలజీ పార్మస్యూట్ కల్ అనాలిసిస్, రెగ్యులేటరీ అఫైర్స్, క్లీనికల్ విభాగంలో పరిశోధన, ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది చెప్పారు.

జాగ్రత్తగా ఈ-క్రాప్ నమోదు

జెడిఎ ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

ఖరీఫ్ 2023లో సాగు చేసిన పంటలను క్షేత్ర స్థాయికి వెళ్లి ఈ క్రాప్ నమోదు చేయాలని రైతు భరోసా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌కు జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సూచించారు. బుధవారం స్థానిక అనంత కషి భవన్‌లో అనంతపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌కు వ్యవసాయ శాఖ పథకాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏడీఏ ఎం.రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా జెడిఎ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు అందించే ప్రతి కార్యక్రమం వారికి చేరువ చేయాల్సిన బాధ్యత వ్యవసాయ సిబ్బందిపై ఉందన్నారు. ఈ క్రాప్ నమోదులో ఎటువంటి అలసత్వం లేకుండా పూర్తి వివరాలు సేకరించాలని చెప్పారు. రైతుభరోసా కేంద్రం ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు ప్రసాద్, శ్యామ్ సుందర్ రెడ్డి, జె.శశికల, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

బడిబయట ఒక్కరూ ఉండరాదు

కలెక్టర్ ఎం.గౌతమి

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

5 నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్న చిన్నారులు బడి బయట ఒక్కరూ ఉండరాదని, చిన్నారులను ఖచ్చితంగా బడిలో చేర్పించాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. బుధవారం నాడు అనంతపురం నగరంలోని 40, 41వ వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (జిఈఆర్) సర్వేపై విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలో గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో సర్వే వంద శాతం చేపట్టాలన్నారు. 5–18 ఏళ్ల మధ్య ఉన్న చిన్నారులను ఖచ్చితంగా బడిలో చేరేలా చూడాలన్నారు. చిన్నారులు ఎక్కడికి వెళ్లారనేది ప్రతిరోజూ గుర్తించాలన్నారు. ఈ విషయమై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకుని ఈ ప్రక్రియను పూర్తి చేయాలని డిఈఓని ఆదేశించారు. వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పిల్లలను గుర్తించాలన్నారు. ప్రతి వాలంటీర్ పరిధిలో వంద శాతం పిల్లలు ఎన్‌రోల్మెంట్ అయ్యారా.. లేదా..? అనేది పరిశీలన చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బాలికల డ్రాప్ అవుట్ ఉండడానికి వీలు లేదన్నారు. నాడు– నేడు పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి, డీఈవో సాయిరామ్, ఆర్ఐఒ వెంకటరమణ నాయక్, డీఎల్డీవో ఓబులమ్మ, ఎంఇఒ వెంకటస్వామి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్‌లు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట మాజీ ఎంపిపి మృతి

కాలవ శ్రీనివాసులు నివాళి

పాలయ్య (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

మండల పరిధిలోని 75 వీరాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి పూజారి పాలయ్య (72) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఆయన భౌతిక కాయాన్ని బుధవారం సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ పూజారి పాలయ్య తనకెంతో ఆప్తుడని తెలిపారు. పాలయ్య 2017 నుంచి 2019 వరకు గుమ్మగట్ట మండల ఎంపీపీగా పని చేశారని చెప్పారు. పార్టీలకతీతంగా తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. పాలయ్య కుటుంబానికి భవిష్యత్తులో తాను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఛైర్మన్ పూల నాగరాజు, వైసీపీ నాయకులు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ గౌని ఉపేంద్ర రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, 75 వీరాపురం సర్పంచి నాగరాజు, మాజీ ఎంపిపి గిరి మల్లప్ప, మాజీ సర్పంచి రంగస్వామి, టిడిపి నాయకులు సదాశివ, తిప్పేరుద్ర, సత్యనారాయణ, ఉస్మాన్, గోపాల్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య స్కూల్ ఆవరణలో మొక్క నాటుతున్న ఏజిఎం సుబ్బారెడ్డి

శ్రీచైతన్యలో ఘనంగా 'హరిత భారత్'

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో బుధవారం "హరిత భారత్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏజిఎం సుబ్బారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏజిఎం చెట్ల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అలాగే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణ లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపల్ షమీనా, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీర్లచావిడికి విరాళం

శింగనమల : పురాతనమైన కొండమీదరాయుడు పీర్ల చావిడికి బుధవారం తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు రూ. 10 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఆదినారాయణ, బిసి సెల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, కాయల సురేష్ యాదవ్, రంగస్వామి, బాబావలి, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ సర్వే డేటా నమోదు

ప్రజాశక్తి-గార్లదిన్నె

రీ సర్వే డేటాను ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా నమోదు చేయాలని ఆర్డీవో మధుసూదన్ సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలకు సూచించారు. స్థానిక సచివాలయంలో జరుగుతున్న జంబులదిన్నె, మర్తాడు గ్రామాల రీసర్వే డేటా నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆర్డీఓ తహశీసిల్దార్ ఉషారాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వేలో రైతు నుంచి వస్తున్న స్పందన గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే మర్తాడు గ్రామంలో ఆన్‌లైన్‌లో డేటా నమోదులను ఏకకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బి.పప్పూరు పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని బి.పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బొందలవాడ సచివాలయాన్ని బుధవారం మండల ప్రత్యేకాధికారి మహమ్మద్ రఫీ సందర్శించారు. తొలుత పిహెచ్‌సిలో ఓపి, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అలాగే వైద్యులు, సిబ్బంది ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం బొందలవాడ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు, పర్యటన రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అలాగే వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ నిర్మాణం పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపిడిఒ దివాకర్ ఉన్నారు.

మోడల్ స్కూల్ అభివృద్ధికి చేయూత

రాయదుర్గం : రాయదుర్గం తాలూకా బిసి సంఘం, ఈడిగ సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్‌గౌడ్ బుధవారం రాయదుర్గం ఏపి మోడల్ స్కూల్ అభివృద్ధికి రూ. 10 వేలు అందజేశాడు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ వైస్ ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, మండల బిసి సంఘం అధ్యక్షులు, వైసిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ వీరశేఖర్, ఆనంద్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

పివికెకెలో 28న ప్రాంగణ నియామకాలు

అనంతపురం : నగరంలోని పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 28వ తేదీ ఉదయం 9 గంటలకు టెక్ మహీంద్ర ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా. బండి రమేష్‌బాబు తెలిపారు. 2021, 22, 23లో ఏదేని డిగ్రీ లేదా బి.టెక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూ ద్వారా నియా మకాలు చేపడతారని, ఎంపికైన వారిని ట్రైనీ అసోసియేట్‌గా నియమిస్తారని, వార్షిక వేతనం రూ. 2.4 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకూ ఉంటుం దని తెలిపారు.

బిఎల్‌ఒలపై టిడిపి ఫిర్యాదు

ఆత్మకూరు : మండలంలో చేపట్టిన ఓటరు వెరిఫికేషన్‌లో బిఎల్‌ఒలు పాల్గొనడం లేదని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం టిడిపి మండల మాజీ కన్వీనర్ కృష్ణమోహన్ చౌదరి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్‌ఒలు హాజరు కాకపోవడంతో చాలా పోలింగ్ బూత్‌లలో ఇంతవరకు ఓటరు వెరిఫికేషన్ జరగలేదని మండిపడ్డారు. ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి బి.వెంకటనారాయణ, నాయకులు ఉన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు లబ్ధి

గుత్తి : 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధి లోని 22, 23వ వార్డులకు సంబంధించి బుధవారం 11వ సచివాలయంలో సభలు నిర్వహించి 663 మందికి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్లు బి.పద్మలత, బి.వరలక్ష్మి, ఉపతహశీల్దార్ లలిత, కౌన్సిలర్ ఎం.సులోచన, మున్సిపల్ మేనేజర్ మురళీధర్, సచివాలయాల అధికారి ఇమామ్ హుస్సేన్, ఏఇలు సాయినాథ్‌బాబు, రవికుమార్, ఆర్‌ఐలు రామాంజనేయులు, షేక్షావలి, మెప్మా టిఎంసి కిరణ్, సచివాలయ కన్వీనర్ ఎం.రంగస్వామి, గంగాధర్, మహబూబ్‌బీ, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి

నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- అనంతపురం

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బుధవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ముందుగా కెప్టెన్ శేకన్న ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించగా టవర్ క్లాక్, సప్తగిరి, శ్రీకంఠం, ఎన్టీఆర్ సర్కిళ్ల మీదుగా తిరిగి ఆర్ట్స్ కళాశాల చేరుకుంది. ర్యాలీలో జిల్లా మాజీ సైనికుల సంఘం సభ్యులు, ఆర్ట్స్ కళాశాల ఎన్‌సిసి, ఎన్ఎస్-ఎస్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. సంఘం గౌరవాధ్యక్షులు వికె రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు సైనికుల త్యాగాలను గుర్తించుకుని ఓఆర్‌ఓపిని చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులు కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, కెప్టెన్ ఎం.అన్వర్ బాషా, సుబేదార్ మేజర్ ఎన్.కుమారస్వామి, ఎన్.మహమ్మద్ ఇర్షాద్, నాయబ్ సుబేదార్ జింకా రామ్మూర్తి, జెడబ్ల్యూఓ టికె కృష్ణ, నాయబ్ సుబేదార్ గోపీచంద్, సార్జంట్ సి.సంజీవకుమార్, ప్రతాపరెడ్డి, ఎం.వెంకటేష్, హవిల్దార్లు జంగంశెట్టి సురేష్, మహబూబ్‌పీరా తదితరులను సత్కరించారు. మణిపూర్‌లో మాజీ సైనికుడు, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సుబేదార్ భార్య, కూతురిని వివస్త్రను చేసి గ్యాంగ్ రేప్ చేయడమే కాకుండా దారుణంగా హత్య చేసిన సంఘటనను తీవ్రంగా ఖండింస్తూ బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ రంగనాథం, ఎన్ఎస్ఎస్ అధికారులు విష్ణుప్రియ, బంద, శ్రీరామ్‌నాయక్, మాజీ సైనికుల సంఘం ట్రెజరర్ తిమ్మారెడ్డి, బషీర్‌అహ్మద్, నరసింహులు, మదార్‌సాబ్, ఖాజామొయిద్దీన్, నాగిరెడ్డి, రంగారెడ్డి, నబీరసూల్, శివశంకర్, రవికుమార్, గొల్ల ఈశ్వరయ్య, ఏకె మొయిద్దీన్, అబ్దుల్ ఖాదర్, ఆర్ఎస్ నాగరాజు, ఆర్ట్స్ కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గేట్స్ లో కార్గిల్ దివస్

గుత్తి : పట్టణ సమీపంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 'కార్గిల్ దివస్‌'ను ఘనంగా నిర్వహించారు. అనంతపురం, గుత్తికి చెందిన కార్గిల్ యుద్ధంలో పోరాడిన వీరులు, విశ్రాంత జవాన్లు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్గిల్ యుద్ధ వీరులు విశ్రాంత జవాన్లు వారి వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని సూచించారు. అనంతరం కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథరెడ్డి, డైరెక్టర్ వికె.శ్రీవాణి కార్గిల్ యుద్ధవీరులు, విశ్రాంత జవాన్లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సూరయ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మొహరంను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్పీ

ఉరవకొండ రూరల్ సర్కిల్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఉరవకొండ

మొహరం పండుగను ప్రజలందరూ శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. ఆయన బుధవారం ఉరవకొండ రూరల్, అర్బన్ పోలీస్ స్టేషన్లను సందర్శించి రికార్డులను పరిశీలించడంతో పాటు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొహరం సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఇప్పటికే శాంతి కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కలిగించామన్నారు. సమస్యాత్మక గ్రామాలను సైతం గుర్తించి ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలను కాపాడడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్పీతో పాటు గుంతకల్లు డిఎస్పి నర్సింగప్ప, రూరల్ సిఐ శేఖర్, అర్బన్ సిఐ హరినాథ్ ఉన్నారు.

వై.రాంపురం సచివాలయం తనిఖీ

మండల పరిధిలోని వై.రాంపురం సచివాలయాన్ని ఎస్పీ శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించేలా ఎవరైనా ప్రవర్తిస్తే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా యువత సెల్‌ఫోన్ మాయలో పడి జీవితాన్ని నాశనం చేసుకోకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. అలాగే మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆకతాయిలు మహిళలు, బాలికల పట్ల అమర్యాదగా, అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించాలన్నారు. ఎస్పీ వెంట డిఎస్పి నర్సింగప్ప, ఉరవకొండ అర్బన్, రూరల్ సిఐలు, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌పై దృష్టి సారించండి

స్టాండింగ్ కమిటీలో సభ్యులు

సమావేశంలో పాల్గొన్న మేయర్ వసీం, సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరం నడిబొడ్డున ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోందని స్టాండింగ్ కమిటీ సభ్యులు చంద్రమోహన్‌రెడ్డి, ఇషాక్ ధ్వజమెత్తారు. నగర మేయర్ మహమ్మద్ వసీం అధ్యక్షతన బుధవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించగా కమిషనర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, ఎసిపి బాలాజీ, హెల్త్ ఆఫీసర్ గంగాధర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఈఈ చంద్రశేఖర్, రెవెన్యూ ఆఫీసర్లు సతీష్, సుజాత, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పర్యవేక్షణ లేకపోవడంతో చాలా షాపులు నిరుపయోగంగా మారాయన్నారు. సెక్యూరిటీ, నిఘా కెమెరాలు అసాంఘిక శక్తులకు నిలయంగా మారిందన్నారు. రోడ్లపై దుకాణాలు పెట్టడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. వివిధ అంశాలను పాలకవర్గం దృష్టికి తీసుకురాకుండా అధికారులు స్వతంత్రంగా వ్యవహరించటం తగదన్నారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో వీధి కుక్కల కట్టడి, ఓపెన్ జిమ్‌లలో పాడైన పరికరాల మరమ్మతులు, పైపులైన్ లీకేజీలు, రంగు మారిన నీటి సరఫరా అంశాలను ప్రస్తావిస్తూ ఆయా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను ఆదేశించారు. సభ్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ నడిమి వంకలో చెత్తాచెదారం కొండలా పేరుకుపోయిందని యుద్ధ ప్రాతిపదికన చెత్త తొలగింపు పనులు చేపట్టాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ఆసుపత్రిలో భవనాలను ప్రారంభిస్తున్న సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాడు-నేడు కింద రూ. 2.62 కోట్ల వ్యయంతో నిర్మించిన రోగుల బంధువులకు భోజన వసతి గది, అంబులెన్స్ గ్యారేజ్, బయో మెడికల్, వంట గదులు, ఆధునిక వసతులతో కూడిన బ్లడ్ టెస్ట్ స్టోర్ గదులు, ల్యాబ్, ఎక్స్‌రే గది, ఈసీజీ అల్ట్రా, ఓపి, ఇంజక్షన్ డ్రెస్సింగ్, డ్యూటీ డాక్టర్స్, క్యాజువాలిటీ గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం మండలానికి రెండు పిహెచ్‌సిలను అందుబాటులోకి తేవడమే కాకుండా ఒక్కో పిహెచ్‌సిలో ఇద్దరేసి డాక్టర్లను నియమించిందన్నారు. గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిందని, దీంతో చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు కిలోమీటర్ల దూరంలో ఉండే పిహెచ్‌సి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం ఆయన జడ్పీ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ రమణనాయక్, డాక్టర్ శివశంకర్‌రెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామ్‌రెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, వైసిపి నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సర్పంచి నాగమణెమ్మ, నాగవర్ధన్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ముచ్చుకోట శ్రీకాంత్‌రెడ్డి, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందులతో కుష్టును నయం చేయొచ్చు

సమావేశంలో మాట్లాడుతున్న అనుపమ జేమ్స్

ప్రజాశక్తి-అనంతపురం

కుష్టు వ్యాధి సోకిన వారిని గుర్తించి ప్రాథమిక దశలోనే చికిత్స అందిస్తే అంగవైకల్యాన్ని నివారించడంతో పాటు వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ తెలిపారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో నెల వారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుపమజేమ్స్ మాట్లాడుతూ ఇటీవల జిల్లా వ్యాప్తంగా చేపట్టిన "కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు, "లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపైన్" లో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశాలు, ఎఎన్ఎంలు ఇంటింటి సర్వే నిర్వహించడం వల్ల 4,283 మందిని అనుమానిత కేసులుగా గుర్తించారన్నారు. వారికి డాక్టర్స్, లెప్రసీ సిబ్బంది పరీక్షలు చేయగా 73 మందికి లెప్రసీ సోకినట్లు గుర్తించి వెంటనే బహుళ ఔషధ చికిత్స అందించారని తెలిపారు. కుష్టు వ్యాధికి ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, 6 నెలలు లేదా ఏడాది పాటు మందులు వాడితే ఏ దశలోనైనా కుష్టు పూర్తిగా నయమవుతుందని తెలిపారు. సమావేశంలో డా. అన్వర్‌బాషా, పారా మెడికల్ అధికారి నాగన్న, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, డిప్యూటీ పారా మెడికల్ అధికారి సూర్యప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో వేలంపాట

ఆత్మకూరు : పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో పూజ సామగ్రి(హోమం, పూజ సామగ్రి) విడివిడిగా అమ్ముకొనే హక్కు కోసం బుధవారం ఆలయ ఆవరణలో దేవాదాయ, ధర్మదాయ శాఖ అనంతపురం డివిజన్ తనిఖీదారుడు లక్ష్మీనారాయణ, ఆలయ కార్యనిర్వహణ అధికారి బి.అక్కిరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ డి.చంద్ర శేఖర్ రెడ్డి సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో అనంతపురం నగరానికి చెందిన నాగశేషయ్య, రామయ్య అత్యధికంగా రూ. 1,85,000కు పాట పాడి దక్కించుకున్నారు. వేలంలో గతంలో కంటే రూ. 86, 500 ఎక్కువ ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం ఎంపిడిఒ రంగారావు, ఈఓఆర్‌డీ జిలాన్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం తుంగలో తొక్కిందని మండిపడ్డారు. వారికిచ్చే కనీస గౌరవేతనం రూ. 8 వేలను కూడా నెల నెలా సక్రమంగా చెల్లించడం లేదని, పని చేసే సమయంలో భద్రతా పరికరాలను కూడా అందించడం లేదని వాపోయారు. ఇకనైనా జీవో-32 ప్రకారం పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించి 11వ పిఆర్సి ప్రకారం కనీస వేతనం రూ. 20వేలు ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు, మాస్కులు, భద్రతా పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, నాగరాజు, శ్రీరాములు, శివ, చంటి నాగేశ్వరమ్మ, కార్మికులు అంజి, వన్నూరప్ప, ఈశ్వరయ్య, ఓబయ్య, ప్రసాద్, శివకుమార్ పాల్గొన్నారు.

మొహరంను ప్రశాంతంగా జరుపుకోండి : డీఎస్పీ

అనంతపురం క్రైం : కుల, మతాలకు అతీతంగా జరుపుకునే మొహరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని నగర డీఎస్పీ ప్రసాదరెడ్డి సూచించారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సిఐ ధరణీకిషోర్‌తో కలిసి పీర్ల చావిడి మంటపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా మొహరం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. పీర్ల చావిడి, మంటపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవడంతో పాటు ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో కమిటీ వివరాలు స్టేషన్‌లో అందజేయాలన్నారు. ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. చావిడి, మంటపాల ఏర్పాటు ట్రాఫిక్‌కి ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదన్నారు.

'అనంత' మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు

అనంతపురం : అనంతపురం మార్కెట్ యార్డులో అక్రమాలు, అవినీతికి ఆస్కారం లేకుండా ఛైర్మన్ ఎకెఎస్ ఫయాజ్ పటిష్ట చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా యార్డులో కాటా నిర్వహణ, పశువులు, గొర్రెలు, మేకల సంతలో అక్రమాలు జరగకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నారు. అలాగే రైతులకు రూ. 3 కోట్లతో కవరింగ్ షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే చీనీ కాయలు రోజు వారి టాక్స్ కంప్యూటరైజ్డ్ బిల్లింగ్ చేపట్టామన్నారు. సంతల ఆదాయం శని, ఆది వారాల్లో ప్రకటిస్తామన్నారు. యార్డులో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

గ్యాస్ సిలిండర్ ప్రమాద బాధితులకు పరామర్శ

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిధిలోని రూప్లానాయక్‌తండా (వెంకటాం పల్లి పెద్దతండా)లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడిన మహిళలను బుధవారం ఉరవకొండ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వర రెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రమాద విషయం తెలుసుకున్న యువనేత వై.ప్రణయ్‌రెడ్డి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, రామసుబ్బారెడ్డి తదితరు లు బుధవారం కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామవత్, సరోజమ్మ, మాధవిలను పరామర్శించారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

గన్నేవారిపల్లి పంచాయతీ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక

తాడిపత్రి రూరల్ : సిఐటియు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో గన్నేవారిపల్లి గ్రామపంచా యతీలో పంచాయతీ కార్మికుల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా సంధ్యాబాయి, ఉపాధ్యక్షురాలిగా రాణి, కార్యదర్శిగా రాజు, సహాయ కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా రామకృష్ణ, కమిటీ సభ్యులుగా లక్ష్మీబాయి, లక్ష్మీదేవి, రామాంజి, రవిలను ఎన్నుకున్నట్లు సిఐటియు రూరల్ కార్యదర్శి హనుమంతరెడ్డి తెలిపారు. నూతన కమిటీకి సిఐటియు జిల్లా నాయకులు జగన్మోహన్‌రెడ్డి, రూరల్ కమిటీ అధ్యక్షురాలు కవిత శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత

కుందుర్పి : ఇటీవల బెంగళూరులో ఓ ప్రమాదంలో మృతి చెందిన వడ్డే లక్ష్మీదేవి కుటుంబ సభ్యులకు బుధవారం బెస్తరపల్లి సర్పంచి మమత ధనుంజయ స్థానిక సచివాలయంలో రూ. 5 లక్షల వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కులాలు, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సహాయ సహకారాలు అందిస్తుంద న్నారు. కార్యక్ర మంలో వైసిపి సీనియర్ నాయకులు హనుమంత రాయుడు, ఎంపిటిసి ఓబు లేశ్, నాయకులు ఎం.రవి, వైస్ సర్పంచి నవీన, హనుమేష్, రామదాసు, నాగేంద్ర, అల్లా బకాష్, సెక్రటరీ, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఇంటర్‌లో సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలి

శింగనమల : స్థానిక జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపిసి గ్రూపులతో పాటు ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యాశాఖ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా జాయింట్ సెక్రటరీ సూర్యప్రకాష్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో సిఇసి, హెచ్ఇసి గ్రూపులు మాత్రమే ఉన్నాయని దీంతో చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులు సైన్స్ గ్రూపుల కోసం అనంతపురం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కావున కళాశాలలో సైన్స్ (ఎంపిసి, బైపిసి) గ్రూపులు ఏర్పాటు చేయాల ని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, శింగనమల నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాబాఫకృద్దీన్, వర్ధన్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు..

సచివాలయ సిబ్బందికి శిక్షణ

పుట్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ యోగా నందరెడ్డి ఆధ్వర్యంలో హౌసింగ్ డిపార్ట్ మెంట్‌కి సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మంజూరైన 260 ఇళ్లను పది రోజుల్లోపు గ్రౌండింగ్ చేయాలని ఇంజినీరింగ్ సహాయకులకు సూచించారు. ఆర్ఎల్, ఆర్‌సి స్టేజ్‌లో ఉన్న లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఆగస్టు 7వ తేదీ లోపు ఇళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ లోకేష్ కుమార్ పంచా యతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

కుటుంబ కలహాలతో ఓ వివాహిత బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. త్రీ టౌన్ సిఐ ధరణీకిషోర్ తెలిపిన వివరాల మేరకు... గణేనాయక్ కాలనీకి చెందిన ప్రశాంత్, రాధమ్మ(22) భార్యాభర్తలు. ప్రశాంత్ ఆటో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ప్రశాంత్ ఉదయం 8 గంటల సమయంలో తనకు కాలు బాగాలేదని పనికి వెళ్లలేనని చెప్పి, తన ఇద్దరు పిల్లలను స్కూల్లో వదిలి రావడానికి వెళ్ళాడు. భర్త పనికి వెళ్లలేదని మనస్తాపం చెందిన రాధమ్మ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్నాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి-ఉరవకొండ

అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం ప్యాకెట్లను పట్టుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పాల్తూరు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి మండల పరిధిలోని పాల్తూరు-హావలిగి రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కాపు కాచామన్నారు. ఆ మార్గంలో పాల్తూరు గ్రామానికి చెందిన కుమారస్వామి ఆటోలో బళ్లారి నుంచి అక్రమంగా కర్నాటక మద్యాన్ని తరలిస్తుండగా 288 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఆటోతో పాటు కుమార్‌స్వామి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘర్షణ కేసులో ఆరుగురు బైండోవర్

ప్రజాశక్తి-గుత్తి

మండల పరిధిలోని బాచుపల్లి బాట సుంకులమ్మ ఆలయ ఆవరణలో మరుగుదొడ్డి నిర్మాణ విషయంలో ఘర్షణ పడిన వారిని పోలీసులు బైండోవర్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని బాచుపల్లి గ్రామ శివారులో ఉన్న బాట సుంకులమ్మ ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. అయితే తనకు తెలియకుండా మరుగుదొడ్లు ఎలా నిర్మిస్తారని ఆలయ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు ఇతర కమిటీ సభ్యులతో గొడవకు దిగాడు. ఇరు వర్గాల మధ్య మాటా మాటా పెరిగి మంగళవారం పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన వెంకటేశ్వర్లు, నారాయణస్వామి గాయపడగా గుత్తి ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలకు చెందిన ఆరుగురిపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఘర్షణకు దిగిన ఆరుగురుని బుధవారం తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, డిటి లలిత ఎదుట పోలీసులు బైండోవర్ చేయించారు. భవిష్యత్తులో ఇలాంటి గొడవలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు వారిని హెచ్చరించారు.

తాడిపత్రి తహశీల్దార్ కార్యాలయం. ఇన్‌సెట్‌లో చిరిగిన జాతీయజెండా

తాడిపత్రి తహశీల్దార్ కార్యాలయంపై చిరిగిన జాతీయ జెండా

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంపై కొన్ని రోజులుగా జాతీయ జెండా చిరిగిపోయి దర్శనమిస్తోంది. నిత్యం ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యాలయానికి వస్తూ పోతూ ఉంటారు. అయినా ఏ ఒక్కరూ ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి చిరిగిన జెండా స్థానంలో కొత్త జెండా ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

కోతి దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-నార్పల

రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిపై కోతి దాడి చేసి గాయపరచిన సంఘటన బుధవారం నార్పలలో చోటు చేసు కుంది. వివరాలు.. గుంతకల్లు మండల పరిధిలోని నక్కలదొడ్డి తండాకు చెందిన వెంకటేష్‌నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో గూగూడు కుళ్లాయిస్వామి దర్శనార్థం వెళ్తూ నార్పలలో ఆగారు. స్థానిక గూగూడు రోడ్డులోని ఎస్‌బిఐ సమీపంలో ఓ దుకాణంలో టెంకాయలు, పూలు కొని ఆటో వద్దకు వెళ్తున్న వెంకటేష్ నాయక్‌పైకి కోతి దూకి అతని కుడికాలును కరవడంతో తీవ్ర రక్తస్రావమైంది. దీంతో అతడిని వెంటనే స్థానిక ప్రాథమిక వైద్యశాలకు తరలించగా వైద్యుడు ప్రవీణ్ గాయాన్ని శుభ్రం చేసి ఇంజక్షన్ వేసి కుట్లు వేశారు. నార్పలలో ఇటీవల కాలంలో కోతులు, పందుల బెడద అధికమైందని దీంతో చిన్నారులు ఇళ్ల నుంచి బయటికి రావడానికి జంకుతున్నారన్నారు. కొద్ది రోజుల క్రితం స్థానిక కోటవీధిలో పంది ఓ చిన్నారిపై దాడి చేసింది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నార్పలలో పందులు, కోతుల దాడుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు

ఇంజినీరింగ్ వర్కర్ హఠాన్మరణం

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ కార్పొరేషన్‌లోని మెప్మా విభాగంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగం వర్కర్ దస్తగిరి బుధవారం రక్తపు వాంతులు చేసుకుంటూ హఠాన్మరణం చెందారు. ఆయన కొంతకాలం గా అనారోగ్యంతో బాధపడుతున్న ట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన వెంటనే మేయర్ మహమ్మద్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి, అధికారులు దస్తగిరి మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. తోటి కార్మికులు విచారం వ్యక్తం చేశారు.

'సున్నా' ఓట్ల సంగతి తేల్చండి : టిడిపి

ప్రజాశక్తి -అనంతపురం



డిఆర్‌ఓ గాయత్రీదేవికి ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో డోర్ నెంబర్ సున్నాతో నమోదైన 3,178 ఓట్ల సంగతి తేల్చాలని కోరుతూ బుధవారం టిడిపి బిసి సెల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో డిఆర్‌ఓ గాయత్రీదేవికి వినతి పత్రం సమర్పించా రు. ఈ సందర్భంగా టిడిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, నగర అధ్యక్షులు సిమెంటు పోలన్న మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహకారంతో డోర్ నెంబర్ సున్నాతో దొంగ ఓట్లను ఎక్కించిందని మండిపడ్డారు. బిఎల్‌ఒలు సర్వర్ మొరాయిస్తోందని బూచిగా చూపి ఇలాంటి అక్రమాలకు తెరలేపారని ఆరోపించారు. కావున ఓట్లను ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాలని కోరారు. ముఖ్యంగా సున్నా డోర్ నెంబర్‌తో నమోదైన ఓట్లను తొలగించి, వాటిని నమోదు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో నాయకులు కొండ, మల్లికార్జున ఉన్నారు.

In the court of the Senior Civil Judge:Gooty

I.P.No:10/2019

Between:

C.Suryanarayana Reddy ...petitioner

v/s

1.C.Ramachandra Reddy R1

2.Gudla Ravi R2

...Defendant/Defendant

Notice to Defendant

To:

C.Ramachandra Reddy S/o Chenna Reddy,
Residing at Gooty (V and M) B.C.Colony,
Ananthapuramu (Dist)

పై నెంబరు దావాలో కేసు ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 28-07-2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

B.JAYARAMI REDDY,
ADVOCATE, GOOTY.